క్లుప్తంగా

నేడు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహిళ అనుమానాస్పద మృతి

మీర్‌పేట్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లెనిన్‌నగర్‌కు చెందిన రేణుక(35) ఇళ్లల్లో పని చేస్తూ జీవనం సాగిస్తోంది. మంగళవారం సాయంత్రం రేణుక ఇద్దరు పిల్లలు ఆడుకోవడానికి వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత ఇంటి వచ్చారు. తల్లి రేణుక పడుకొని ఉండడం, ఎంత లేపినా లేవకపోవడంతో పక్కింటి వారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా రేణుక చనిపోయినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా ఆమె మెడపై గాయాలు కనిపించాయి. హత్య కోణంలో కేసు విచారించగా ప్రకాష్ అనే మేస్త్రీతో ఆమెకు అక్రమ సంబంధం ఉన్నట్లు గుర్తించారు. సోమవారం రాత్రి ప్రకాష్, రేణుక గొడవ పడినట్లు తెలిసిందన్నారు. ప్రకాష్ దాడి చేయడం వల్లే రేణుక చనిపోయి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అఖిలపక్ష నాయకుల డిమాండ్



స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న నాయకులు

కొత్తూరు: డాక్యుమెంట్ రైటర్ మామిడి కరుణాకర్‌రెడ్డి హత్యకేసులో సంబంధం ఉన్న వారందరిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నేత వీర్లపల్లి శంకర్, సీపీఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తూరు పోలీసులను కలిసి విచారణను నిష్పక్షపాతంగా జరపాలని కోరారు. విచారణలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా నిందితులకు శిక్షలు పడే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం పోలీసుల నిర్లక్ష్యంతోనే కరుణాకర్‌రెడ్డి హత్య జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, హరినాథ్‌రెడ్డి, గణేష్, నర్సింహారెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట

జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత



శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

కొత్తూరు: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత అన్నారు. మండలంలోని ఎస్‌బీపల్లిలో మంగళవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీలత మాట్లాడుతూ.. అంధత్వ నివారణలో భాగంగా కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందిస్తున్నట్లు వివరించారు. సమస్యలు తీవ్రంగా ఉన్న వారిని పలు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి ప్రభాకర్, ఉప సర్పంచ్ బాల్‌రాజు, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌కే నూతన కమిటీ ఎన్నిక



సభ్యులను సన్మానిస్తున్న కాలనీవాసులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని సీఎస్‌కే గ్రీన్ విల్లాస్ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా అప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సోమశేఖర్, కోశాధికారిగా సాదత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... సీఎస్‌కే కాలనీని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కమిటీ అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నందుకు బీఆర్ఎస్ నేత జమృత్‌ఖాన్, కౌన్సిలర్ శ్రావణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులను కాలనీవాసులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు.

గట్టుగా గుట్కా విక్రయాలు

- అమలు కాని నిషేధం
- అధిక ధరలకు అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు



షాబాద్‌లోని దుకాణాలపై దాడులు చేస్తున్న పోలీసులు (ఫైల్)

షాబాద్: ప్రజల ఆరోగ్యం దృష్ట్యా గుట్కా విక్రయాలను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గుట్కా నిషేధం సమంజసం అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో ఆచరణకు నోచుకోవడం లేదు. దళారుల మాయాజాలంతో గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పక్క రాష్ట్రాల నుంచి గుట్కాలను దిగుమతి చేసుకొని దళారులు, వ్యాపారులు లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఒక్క రూపాయి విలువ గల గుట్కా ప్యాకెట్‌ను ఐదు రూపాయల వరకు విక్రయిస్తున్నారు. పది రూపాయలు విలువ గల ప్యాకెట్‌ను స్టాక్ లేదంటూ రూ.30నుంచి 40వరకు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో షాబాద్‌లో గుట్కాలు విక్రయిస్తున్నా దుకాణాలపై పోలీసులు దాడులు చేసి గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. ఏ కిరాణం షాపుల్లో, పాన్ షాపుల్లో, జనరల్ స్టోర్స్‌ల్లో తనిఖీ చేసిన గుట్కా ప్యాకెట్లు విరివిగా లభ్యమవుతున్నాయి. తెలంగాణలో నిషేధం విధించిన ఇక్కడి వ్యాపారులు కర్ణాటక రాష్ట్రం నుంచి గుట్కా ప్యాకెట్లు దిగుమతి చేసుకునేవారు. కానీ గత రెండు సంవత్సరాల క్రితం కర్ణాటక రాష్ట్రంలో కూడా నిషేధం విధించారు. ఈ నిషేధాన్ని ఆదునుగా చేసుకున్న వ్యాపారులు, దళారులు ఒక్కసారిగా వాటి ధరలను పెంచి లాభాలు గడిస్తున్నారు. తెలిసిన వారికి మాత్రమే గుట్కాలను విక్రయిస్తూ తెలియని వారికి లేవని చెబుతూ గుట్కా వ్యాపారులు తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ గుట్టు చప్పుడూ కాకుండా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం గుట్కా నిషేధం విధించిన తరువాత మండలంలో అధిక రేట్లకు అమ్ముతూ గుట్కా వ్యాపారులు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారు. గుట్కా నిషేధానికి అధికారులు ప్రకటనలకే పరిమితమయ్యారే తప్ప ఆచరణలో చూపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని వివిధ దుకాణాలపై దాడులు జరిపితే లక్షల రూపాయల విలువ గల గుట్కా ప్యాకెట్లు లభ్యమవుతాయని మండల ప్రజలు చెబుతున్నారు.

ఫైర్‌సేఫ్టీ పరికరాలు తప్పనిసరి

అగ్నిమాపక కేంద్రం అధికారి భిక్షపతి

చేవెళ్ల: పెట్రోల్ పంపుల వద్ద, కంపెనీల్లో తప్పనిసరిగా నిబంధనల ప్రకారం ఫైర్‌సేఫ్టీ అందుబాటులో ఉంచుకోవాలని చేవెళ్ల ఫైర్ స్టేషన్ అధికారి భిక్షపతి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెట్రోల్ పంపుల వద్ద, కంపెనీల వద్ద జరిగే అగ్నిప్రమాదాల గురించి వివరిస్తూ ప్రమాదం జరిగిన సమయంలో ఎలాంటి వాటితో ప్రమాదాలను నివారించవచ్చునని సిబ్బందికి అవగాహన కల్పించడంతో పాటు వాటిని చేసి చూపించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. పెట్రోల్‌పంపులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వాటిని నివారించేందుకు తగిన ఫైర్‌సేఫ్టీ పనిముట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. భారీ ప్రమాదాలు జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది శ్రీనివాస్, గోపాల్, శ్రీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఖాజా ఉన్నారు.



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ధ్యానం సర్వరోగ నివారిణి

ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి, జ్ఞాన ప్రచారకర్త, వెంకటలక్ష్మి



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి, జ్ఞాన ప్రచారకర్త వెంకటలక్ష్మి

షాబాద్: ధ్యానం సమస్త రోగాలను నయం చేస్తుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి, జ్ఞాన ప్రచారకర్త వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మారావుగూడ, మక్తగూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ గ్రామాల్లోని ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం శరీరంలో ఉన్న ఎలాంటి రోగాలనైనా తగ్గించి భవిష్యత్తులో వ్యాధులు రాకుండా ధ్యానం కాపాడుతుందన్నారు. తలనొప్పి నుంచి మొదలుకొని క్యాన్సర్ లాంటి ప్రమాదకర జబ్బులను కూడా ధ్యానం ద్వారా తగ్గించుకోవచ్చని, నిత్యజీవితంలో ఎన్నో సమస్యలతో సతమతమవుతూ ఒత్తిడికి గురయ్యే వారికి ధ్యానం ప్రశాంతతను ఇస్తుందని తెలిపారు. దినచర్యలో ధ్యానం చేయడం ఒక అలవాటుగా మార్చుకోవాలని, ధ్యానం ద్వారా ఆధ్యాత్మిక చింతన కూడా మొదలై ఎంతో ప్రశాంతత లభిస్తుందన్నారు. పిరమిడ్ ద్వారా, సామూహిక ధ్యానం ద్వారా మూడు రెట్లు శక్తిని అధికంగా పొందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, సంగు వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, సుభద్ర, స్వప్న, గుండం శైలజ, కృష్ణమద్దిలేటి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

సర్పంచ్ జయశ్రీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జయశ్రీ

షాద్‌నగర్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని సర్పంచ్ జయశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని విఠ్యాలలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెబ్బనమోని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడా లేని విధంగా గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు డ్రస్‌కోడ్‌ను అమలు చేయడంలో వారికి చీరలను పంపిణీ చేయడం హర్షణీయమని అన్నారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటుగా సకాలంలో రుణాలను తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి వెంకటమ్మ, కోశాధికారి ప్రణీత, వీఓఏ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌దే అధికారం

జోడో యాత్రలో ఆ పార్టీ నేతలు

దౌల్తాబాద్: రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు ఆశాభావం వ్యక్తం చేశారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం అల్లాపూర్‌లో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే తప్పా.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని ఆరోపించారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన కాంగ్రెస్ పట్ల ప్రజలు ఇంకా అభిమానం చూపిస్తున్నారని వెల్లడించారు. పార్టీ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ, నిరుపేదలకు రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, బోయిని వెంకట్రాములు, వీరన్న, సత్యపాల్, వెంకట్రాములు, నర్సప్ప, కుర్మనిదస్తప్ప, శరణయ్య, నర్సింగ్‌భాన్‌సింగ్, మహిపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్: మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో బుధవారం నిర్వహించనున్న కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు మహేందర్ ముదిరాజ్, మల్లేష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మక్బుల్, మహేందర్‌రెడ్డి, బిక్షపతి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం

షాబాద్: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనురాధ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 21వ తేదీన ఉ.11:30 గంటలకు ఎంపీపీ ప్రశాంతిరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కంటి వెలుగుతో ప్రయోజనం

మున్సిపల్ చైర్మన్ నరేందర్



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన నరేందర్

షాద్‌నగర్: కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 20వ వార్డులో కౌన్సిలర్ జీటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యల నుంచి పేదలకు విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలను వాడవాడలా నిర్వహిస్తుందన్నారు. 18 ఏళ్లలోపు వారందరికి శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటుగా అవసరం ఉన్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేస్తుందని చెప్పారు. కంటి సమస్యలు తీవ్రంగా ఉంటే వారికి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని సరోజిని ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ నిరుపేదల ఆరోగ్య సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లాహోటీ, ఎంసాని శ్రీనివాస్, గోపాల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

షాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు అజీమ్‌పాషా, ఉపాధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల పరిషత్తు కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి ఎంపీడీఓ అనురాధకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 28వ తేదీ వరకు స్పందించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆశ్రిత, ఝాన్సీ, రాబియా, సంధు, చంద్రకాంత్, మురళీకృష్ణ, యాదయ్య, మహేందర్‌రెడ్డి, గౌరీసింధు, రాకేష్ తదితరులున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి

మొయినాబాద్: రాజేంద్రనగర్ మెట్రోపాలిటిన్ కోర్టులో న్యాయవాది రవికాంత్‌రెడ్డిపై దాడిచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి రామకృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ కోర్టులో న్యాయవాది రవికాంత్‌రెడ్డిపై జరిగిన భౌతిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదులపై అనేక సందర్భాల్లో దాడులు జరుగుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. దాడికి నిరసనగా బుధవారం రాజేంద్రనగర్ కోర్టులో విధులను బహిష్కరిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే ఆమోదించి న్యాయవాదుల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ కిరణ్, మాజీ అధ్యక్షుడు రాజేందర్, రాజుబాబు, పాండురంగారెడ్డి, మాజీ ప్రధాన్య కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, న్యాయవాది సిద్దేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌తో పునర్జన్మ ప్రసాదించవచ్చు

డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి



కొత్తూరు: సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జయలక్ష్మి

కొత్తూరు: గుండెపోటుకు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ చేసి పునర్జన్మ ప్రసాదించవచ్చని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో మంగళవారం సీపీఆర్ చేసే విధానంపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత మాట్లాడుతూ... ఇటీవల కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు తాజా ఆహారం, తగిన వ్యాయామం చేస్తే గుండెపోటు నుంచి సాధ్యమైనంత వరకు తప్పించుకోవచ్చన్నారు. కాగా, గుండెపోటుకు గురైన వ్యక్తులకు ప్రతి ఒక్కరు సాయం చేయాలన్నారు. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో పాటు ప్రథమ దశలో సీపీఆర్‌లో భాగంగా ఛాతిపై నొక్కడం, నోటిద్వారా శ్వాస ఇవ్వడం లాంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ వీరేందర్, కౌన్సిలర్లు, తహసీల్దార్ రాములు, ఎంపీడీఓ శరత్ చంద్రబాబు, కొత్తూరు పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్, ఆయా శాఖల మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ నియంత్రణకు చర్యలు



షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

షాద్‌నగర్: టీబీ నియంత్రణకు ఆరోగ్య సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. మంగళవారం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్‌యంలు, డీఈఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా పర్యటించి టీబీ సోకిన వారిని గుర్తించాలని అన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారికి చికిత్సలు అందించేందుకు ఆసుపత్రికి తరలించాలని అన్నారు. ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా గాలి ద్వారా టీబీ వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారు తుమ్మడం, దగ్గడం, ద్వారా వచ్చే తుంపర్లు ఇతరలకు సోకే ప్రమాదం ఉందని అన్నారు. దగ్గుతో పాటుగా జ్వరం రావడం, ఛాతి, తలనొప్పి, నీరసం, అలసట, ఆకలి, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి సంఖ్య పెంచేందుకు సిబ్బంది తగిన విధంగా కృషి చేయాలని అన్నారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని ఆరోగ్య సిబ్బంది అధిగమించాలని, విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించవద్దని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల్లో చిన్నారులకు వ్యాక్సినేషన్ టీకాలను ఎప్పటికప్పుడు వేయించాలని అన్నారు. ఈ సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డీఈఓ డాక్టర్ ఝాన్సీ, ఏఎన్‌యంలు తదితరులు పాల్గొన్నారు.